# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. 'హర్‌ఘర్‌తిరంగా' కార్యక్రమాన్ని మరపురాని ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.
2. మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
3. రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ తెలిపారు.
4. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నైపుణ్య గణనను ప్రారంభించనున్నట్టు విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
5. రాజమహేంద్రవరం నగరాన్ని వారసత్వ నగరంగా గుర్తించి, హృదయ్ పథకాన్ని వర్తింపజేయాలని పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

==========================

స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో, 'హర్‌ఘర్‌తిరంగా' కార్యక్రమాన్ని మరపురాని ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. ప్రొఫైల్ చిత్రాన్ని త్రివర్ణ పతాకంగా మార్చుకున్నానని అందరూ అలాగే చేయండని తెలిపారు. జాతీయ జెండాలతో ఉన్న సెల్ఫీలను harghartiranga.comలో షేర్ చేయండి అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కాగా మరోవైపు ప్రకృతి విపత్తు సంభవించిన కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు సందర్శిస్తారు. ఈ మేరకు కన్నూర్, వాయనాడ్‌లలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు చోట్ల ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రధానమంత్రి తాత్కాలిక కార్యక్రమం ప్రకారం రేపు ప్రధానమంత్రి కన్నూర్ విమానాశ్రాయనికి … చేరుకుని కాల్పెట్టాలో ఏరియల్ సర్వే చేస్తారు. వాయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని సందర్శిస్తారు.

--------------------------

మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 5.53

శాతం మంది ఆదివాసీలు ఉన్నారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మన్యం ప్రాంతాల్లో సాగు చేసే అరకు కాఫీ ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి ప్రచారం కల్పించామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (41 సేకన్లు)

---------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా గిరిజనసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి మార్కాపురం శాసన సభ్యులు కె.నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఆదివాసిల సంక్షేమానికి అనేక  చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఆదివాసీలు ఆర్థిక సాధికారతను సాధిస్తున్నారన్నారు. గిరిజనుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పథకాలపై జిల్లాలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

---------------------------

రాష్ట్రంలో  కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ తెలిపారు. నెల్లూరులోని ప్రభుత్వ  ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన డయాలసిస్ యూనిట్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సదుపాయాలతో కార్పొరేట్ స్థాయిలో కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. నెల్లూరులో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకారం అందించటం అభినందనీయమన్నారు.  ప్రభుత్వ ఆసుపత్రులలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నైపుణ్య గణనను  ప్రారంభించనున్నట్లు విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన విధివిధానాల రూపకల్పనపై నైపుణ్యాభివృద్ధి  అధికారులతో నిన్న మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నైపుణ్య గణన పూర్తిచేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తొలుత ఒక నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరాన్ని వారసత్వ నగరంగా గుర్తించి, హృదయ్' పథకాన్ని వర్తింపజేయాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రప్రభుత్వాన్ని  కోరారు.

లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో నిన్న ఆమె మాట్లాడుతూ.. రాజకీయ, వ్యవసాయ, అక్షరాస్యత, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యమున్న ఈ నగరం రాష్ట్ర చారిత్రక రాజధానిగా కీర్తి గడించిందన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న రాజమహేంద్రవరాన్ని వారసత్వ నగరంగా గుర్తించాలన్నారు. తద్వారా పర్యాటకాభివృద్ధికి దోహదపడాలని కోరారు.

---------------------------

వెనుకబడిన ప్రాంతాల్లో ఆకాంక్షాత్మక విభాగాల కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని నీతి అయోగ్ ముఖ్యకార్యనిర్వహణాధికారి బి.వి. ఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నిన్న ఢిల్లీలోని నీతి అయోగ్ కార్యాలయం నుండి దృశ్యమాధమం ద్వారా అన్ని రాష్ట్రాల జిల్లా కలెక్టర్లతో ఆకాంక్షాత్మక విభాగాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, దేశంలో వెనుకబడిన మండలాలను అభివృద్ధి చేయడం కోసం 500 మండలాలను ఎంపిక చేయడం జరిగిందని, వీటి కోసం ఆకాంక్షాత్మక విభాగాల కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఈ మండలాల్లో అభివృద్ధి కోసం 39 సూచికలను ప్రవేశ పెట్టి వంద శాతం పురోగతి సాధించాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

---------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ – ఇస్రోలో ప్రపంచం స్థాయి పరిశోధనలు జరుగుతున్నాయని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మం డలంలోని ప్రయివేట్ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సోమనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రయాన్– 3 స్ఫూర్తితో 2040లో అతి తక్కువ ఖర్చుతో మనుషులను చంద్రుడి మీదకు తీసుకెళ్లేందుకు పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 23న ఢిల్లీలో నిర్వహించే జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం 2024–25 వార్షిక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కు మార్ ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల అనుసంధానంతో సామర్థ్యత పెంచేలా ప్రణాళికపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా 660 మండలాల్లో 13 వేల 189 మంది సర్పంచ్ లు, 14 వేల 989 కార్య దర్శులకు శిక్షణ ప్రారంభమైందని గ్రామీణాభివృద్ధి సంచాలకులు వీఆర్ కృష్ణ తేజ పేర్కొన్నారు.

=====================